

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి



వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని డాటా ఎంట్రీ పని విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

# డాటా ఎంట్రీలో తప్పులు రావొద్దు

- కంప్యూటర్ ఆపరేటర్లకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- 'ప్రజాపాలన'లో స్వీకరించిన దరఖాస్తుల డాటా ఎంట్రీ నమోదుపై శిక్షణ
- టీమ్‌లో 20 మందితో.. 57 టీమ్‌లు ఏర్పాటు
- ఈ నెల17వ తేదీ వరకు పూర్తి చేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వికారాబాద్, జనవరి 5: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ నమోదుపై శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు 57 టీమ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి టీమ్‌లో 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉంటారన్నారు. అన్ని మండల కేంద్రాల్లో సెంటర్లను ఏర్పాటు చేశామని, ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో 10 మంది చొప్పున డాటా ఎంట్రీ చేయాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని, ఒక్క టీమ్ ప్రతిరోజు వెయ్యి దరఖాస్తులను అప్లోడ్ చేయాలని, ఈనెల 17 వరకు పూర్తి చేయాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, సెల్ నంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో ఒక దరఖాస్తు అప్లోడ్ చేసేందుకు రూ.5, భోజనం, నీటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎంట్రీ చేసిన దరఖాస్తులు గల్లంతు కాకుండా పూర్తి జాగ్రత్త వహించి భద్రపరచాలన్నారు. దరఖాస్తు నమోదు చేసిన తర్వాత వచ్చే యూనిక్ నంబర్‌ను రెడ్ పెన్నుతో దరఖాస్తు పైభాగంల రాసి, దరఖాస్తు చివరి భాగంలో ఎంట్రీ చేసిన ఆపరేటర్ పేరు సంతకం చేయాలని సూచించారు. శనివారం (నేడు) మధ్యాహ్నం నుంచి పనులు ప్రారంభించాలని అన్ని సెంటర్లలో అవసరమైన స్పీడ్‌గా పనులు పూర్తి చేసేందుకు ఇంటర్నెట్ సదుపాయం, విద్యుత్తు సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఈ డాటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన డాటా ఎంట్రీ పనులను మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్ల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక్

## బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

- అధికారులకు కలెక్టర్ శశాంక్ ఆదేశం

రంగారెడ్డి, జనవరి 5 (నమస్తే తెలంగాణ): అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, కార్యాలయాల్లో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దవాఖానలో రోగితో మాట్లాడుతున్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు (ఫైల్)

## షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు 'ఎన్‌క్యూఏఎస్' సర్టిఫికెట్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 5: షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఎన్‌క్యూఏఎస్' (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్ట్స్) సర్టిఫికెట్ వచ్చిందని దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29, 30 తేదీన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బృందం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానను సందర్శించి, ఏడు శాఖలను పరిశీలించి వసతులపై సంతృప్తి చెంది సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. ఈ సర్టిఫికేషన్ 3 ఏండ్ల వరకు ఉంటుందని, ఏడాదికి రూ.5 లక్షల పారితోషకం ఇస్తారని తెలిపారు. ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ రావడంతో వైద్య సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

## చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి

పెద్దేముల్, జనవరి 5: అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికరమైన ఆహారంతోపాటు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించాలని జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి సూచించారు. మండలంలోని బండమీదిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, టీచర్ నాగమ్మ, సిబ్బంది ఉన్నారు.

## కళానైపుణ్యం పెంపొందించుకోవాలి

**రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్**



చేవెళ్ల గురుకుల పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మొయినాబాద్, జనవరి5: విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభకనబర్చడంతోపాటు కళానైపుణ్యంను పెంపొందించుకోవాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్ సూచించారు. మండలంలోని తోలుకట్టా గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల చేవెళ్ల గురుకుల కళాశాల/పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల బంట్వారం కళాశాల/పాఠశాలలో శుక్రవారం జన్య ఫౌండేషన్ 'జన్య సైంటిఫిక్ రంగోలి, జీవ సైన్స్ ఫెయిర్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంఈవో అక్బర్, ఆలూరి ప్రధానోపాధ్యాయుడు నర్సిములు, చేవెళ్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి, బంట్వారం పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ కూలీలు (ఫైల్)

# ఉపాధిలో మూడో స్థానం

- నవాబుపేట్‌లో 332 కుటుంబాలకు వంద రోజుల పని
- కూలీల పాలిట శాపంగా మారిన ఆధార్ లింక్
- త్వరలోనే ఫేస్‌మాస్క్ పేరిట మరో నిబంధనకు చర్యలు ?

పరిగి, జనవరి 5: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పించడంలో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. గత కొన్ని ఏండ్లుగా కూలీలకు పని కల్పించడంలో వికారాబాద్ జిల్లా మొదటి మూడు స్థానాల్లో నిలుస్తూ వస్తుంది. వికారాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 1,82,794 ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉండగా, ఆయా కుటుంబాల్లో 3,76,101 మంది కూలీలు ఉన్నారు. జిల్లా పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు రూ.170 కోట్ల విలువ చేసే 62,83,158 పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగింది. ఇందులో భాగంగా ఉపాధిహామీ పథకం కింద ఫారమ్ పాండ్‌ల నిర్మాణం, భూమి చదును చేసే పనులు, హరితహారం కింద మొక్కల పెంపకానికి గుంతలు తవ్వడం, ఇతర పనులు చేపట్టడం జరిగింది. జిల్లా పరిధిలో గత డిసెంబర్ నెలాఖరు వరకు 54,95,230 పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించగా 48,66,752 (89శాతం) పనిదినాలను కూలీలకు కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1979 కుటుంబాలు వంద పనిదినాల కంటే అధికంగా పనిచేశారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మొత్తం రూ.90.45 కోట్లు చెల్లించారు. ఉపాధిహామీ కూలీకి రోజుకు రూ.272 చెల్లించాల్సి ఉండగా వారు చేసిన పనికి సంబంధించిన వరకు చెల్లింపులు చేపడతారు. ఇప్పటివరకు చెల్లింపులు పోను సుమారు రూ.రెండు కోట్ల వరకు కూలీ డబ్బులు రావాల్సి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, వికారాబాద్ జిల్లా ఉపాధిహామీ కూలీలకు పని కల్పించడంలో 3వ స్థానంలో నిలవగా, వంద రోజులు పని కల్పించడంలో 6వ స్థానంలో నిలిచింది.

### లక్ష్యం దాటిన పెద్దేముల్ మండలం..

ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలకు పని కల్పించడంలో పెద్దేముల్ మండలం నిర్దేశించిన లక్ష్యం కంటే అధికంగా పని కల్పించడం ద్వారా వికారాబాద్ జిల్లా పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. పెద్దేముల్ మండలానికి సంబంధించి డిసెంబర్ వరకు 3,63,153 పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటివరకు 3,71,590 పనిదినాలు కల్పించడం ద్వారా జిల్లాలోనే అగ్రభాగంలో నిలిచింది. మండలంలో వంద రోజులు పని పూర్తి చేసిన 64 కుటుంబాల కూలీలకు రూ.6.73 కోట్లు చెల్లించారు. జిల్లాలో అత్యధికంగా నవాబుపేట్ మండలంలో 332 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు.

### ఆధార్ లింక్ ఉంటేనే పనికి రావాలే..

కేంద్ర ప్రభుత్వం కొత్తగా కూలీల జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయడంతో కూలీలకు ఇబ్బందిగా మారింది. ఆధార్‌కార్డు అనుసంధానం ఉంటేనే కూలీ పనికి రావాలని, లేదంటే రావద్దని సూచిస్తుండడం గమనార్హం. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కూలీల పాలిట శాపంగా మారిందని చెప్పవచ్చు. మరోవైపు పనిచేస్తున్న చోట ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు ఫోటోలు అప్‌లోడ్ చేయాలనడం సైతం ఇబ్బందికరంగా తయారైంది. త్వరలోనే ఫేస్ మాస్క్ పేరిట ప్రతి ఒక్కరి ఫోటోలు అప్‌లోడ్ చేయాలనే నిబంధన తీసుకురానున్నట్లు తెలిసింది. కొత్త నిబంధన అమలులోకి వస్తే కూలీలకు మరింత ఇబ్బంది కలుగుతుంది. వికారాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం రోజుకు 3,802 మంది కూలీలు పనికి వస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో ప్రారంభమై, మార్చి, ఏప్రిల్, జూన్‌లలో పనులు ముమ్మరంగా కొనసాగుతాయి.